బాధిత కుటుంబాలకు అండగా ఉంటా

- నర్సాపూర్ ఎమ్మెల్యే సునీతాలక్ష్మారెడ్డి
- ఇటీవల మృతి చెందిన ఇద్దరు స్నేహితులు, వార్డు మెంబర్, ఇల్లు దగ్ధమైన బాధితులకు ఎమ్మెల్యే పరామర్శ
- ఇందిరమ్మ ఇల్లు మంజూరుకు హామీ

శివ్వంపేట: అల్లీపూర్‌లో మృతుల కుటుంబాలను పరామర్శిస్తున్న ఎమ్మెల్యే సునీతాలక్ష్మారెడ్డి

వెల్దుర్తి: లబ్ధిదారులకు సీఎంఆర్ఎఫ్ చెక్కులు అందజేస్తున్న నర్సాపూర్ ఎమ్మెల్యే

వెల్దుర్తి, జనవరి 11: మండలంలోని ధర్మారం గ్రామంలో విద్యుత్ షార్ట్ సర్క్యూట్‌తో టంటం నవీన్, టంటం ప్రభాకర్ ఇల్లు దగ్ధమైన విషయం తెలుసుకున్న ఎమ్మెల్యే సునీతాలక్ష్మారెడ్డి, నాయకులతో కలిసి శనివారం పరిశీలించారు. బాధిత కుటుంబ సభ్యులను పరామర్శించారు. ఆర్థిక సాయం అందజేశారు. బాధిత కుటుంబాలకు ఇందిరమ్మ ఇల్లు మంజూరు చేసి, అండగా ఉంటామన్నారు. మండలంలోని పలువురికి సీఎంఆర్ఎఫ్ చెక్కులను అందజేశారు. కాంగ్రెస్ సీనియర్ నాయకుడు, మాసాయిపేట మండలం కొప్పులపల్లి గ్రామానికి చెందిన జయరాంరెడ్డి అనారోగ్యంతో మృతిచెందాడు. విషయం తెలిసిన ఎమ్మెల్యే ఆయన అంత్యక్రియలకు హాజరై, కుటుంబసభ్యులను పరామర్శించారు. ఎమ్మెల్యే వెంట బీఆర్ఎస్ వెల్దుర్తి మండల అధ్యక్షుడు భూపాల్‌రెడ్డి, మాజీ జడ్పీటీసీ రమేశ్‌గౌడ్, మాజీ ఎంపీటీసీ మోహన్‌రెడ్డి, మాజీ సర్పంచ్‌లు అశోక్ రెడ్డి, శంకర్‌రెడ్డి, విజయ, నాయకులు శ్రీనివాస్‌రెడ్డి, నర్సింలు ఉన్నారు.

మృతుల కుటుంబాలకు ఎమ్మెల్యే సానుభూతి

శివ్వంపేట, జనవరి 11: మండలంలోని అల్లీపూర్ గ్రామానికి చెందిన ఇద్దరు స్నేహితులు శుక్రవారం నర్సాపూర్‌లో రోడ్డు ప్రమాదంలో మృతి చెందారు. విషయం తెలిసిన ఎమ్మెల్యే సునీతాలక్ష్మారెడ్డి శనివారం అల్లీపూర్ గ్రామంలో నిర్వహించిన అంత్యక్రియల్లో పాల్గొని, మృతుల కుటుంబాలకు సానుభూతి తెలిపారు. ఇద్దరు యువకులు ఒకేసారి రోడ్డు ప్రమాదంలో మృతి చెందడం బాధాకరమని, వారి కుటుంబాలకు అండగా ఉంటానని ధైర్యం చెప్పారు. ఎమ్మెల్యే వెంట బీఆర్ఎస్ మండలాధ్యక్షుడు రమణాగౌడ్, జిల్లా గ్రంథాలయ మాజీ చైర్మన్ చంద్రాగౌడ్, మాజీ ఎంపీపీ కల్లూరి హరికృష్ణ, మాజీ జడ్పీటీసీ పబ్బమహేశ్‌గుప్తా, జడ్పీ కోఆప్షన్ మాజీ సభ్యుడు మన్సూర్, మాజీ సర్పంచ్ పిట్ల సుగుణ శ్రీనివాస్ ఉన్నారు. కొంతాన్‌పల్లికి చెందిన టి.అంజయ్య అనారోగ్యంతో దవాఖానలో చికిత్స పొందుతున్నాడు. సీఎం రిలీఫ్‌ఫండ్‌కు దరఖాస్తు చేసుకోగా రూ.51 వేల సీఎంఆర్ఎఫ్ చెక్కును ఎమ్మెల్యే అందజేశారు. ఎమ్మెల్యే వెంట మాజీ సర్పంచ్ శ్రీనివాస్‌గౌడ్, మాజీ ఎంపీటీసీ ఇందిరా శ్రీనివాస్, నాయకులు నయీమోద్దీన్, సత్యంగౌడ్, షేక్ హుస్సేన్, వినయ్, సద్దాం ఉన్నారు.

అంత్యక్రియల్లో పాల్గొన్న ఎమ్మెల్యే

నర్సాపూర్, జనవరి 11: మండలంలోని లింగాపూర్ గ్రామానికి చెందిన నిమ్మగల్ల దుర్గమ్మ అనారోగ్యంతో మృతి చెందింది. విషయం తెలుసుకున్న ఎమ్మెల్యే సునీతాలక్ష్మారెడ్డి అంత్యక్రియల్లో పాల్గొని కుటుంబ సభ్యులను పరామర్శించారు. మాజీ సర్పంచ్ అశోక్, బీఆర్ఎస్ నాయకుడు లక్ష్మీనర్సయ్య, పార్టీ మండల అధ్యక్షుడు చంద్రశేఖర్, నాయకులు వెంకటయ్య, శేఖర్, విఠల్, లక్ష్మయ్య, లింగం, యాదయ్య పాల్గొన్నారు.

మాజీ వార్డుమెంబర్ కుటుంబానికి పరామర్శ

కౌడిపల్లి, జనవరి 11: కౌడిపల్లికి చెందిన మాజీ వార్డు మెంబర్ ఒబిలాషి లక్ష్మి అనారోగ్యంతో మృతి చెందింది. విషయం తెలుసుకున్న ఎమ్మెల్యే బాధిత కుటుంబసభ్యులను పరామర్శించారు. ఎమ్మెల్యే వెంట సీడీసీ మాజీ చైర్మన్ దుర్గారెడ్డి, నర్సాపూర్ మున్సిపల్ వైస్ చైర్మన్ నయిమొద్దీన్, నాగసాన్‌పల్లి మాజీ సర్పం చ్ ఎల్లం, మాజీ ఉప సర్పంచ్ నరహరి, బీఆర్ఎస్ నాయకుడు పోల నవీన్, రాజు, నాయకులు సత్యంగౌడ్, రాజుగౌడ్ ఉన్నారు.

కౌడిపల్లి: మాజీ వార్డుమెంబర్ కుటుంబాన్ని పరామర్శిస్తున్న నర్సాపూర్ ఎమ్మెల్యే

నర్సాపూర్‌లో నిమ్మగళ్ల దుర్గమ్మ అంత్యక్రియల్లో పాల్గొన్న ఎమ్మెల్యే సునీతారెడ్డి

బీఆర్ఎస్ ప్రభుత్వం మంజూరు చేసిన పనులకు టెండర్లు పూర్తి: ఎమ్మెల్యే

నర్సాపూర్, జనవరి 11: బీఆర్ఎస్ ప్రభుత్వ హయాంలో మంజూరైన రోడ్ల నిర్మాణానికి టెండర్లు ఫైనల్ అయ్యాయని ఎమ్మెల్యే సునీతాలక్ష్మారెడ్డి ప్రకటనలో పేర్కొన్నారు. శివంపేట్ మండలం అల్లీపూర్ పీడబ్ల్యూడీ రోడ్డు నుంచి అల్లీపూర్ ఎల్‌టీ వరకు రూ.70 లక్షలు, జడ్పీ రోడ్డు నుంచి తౌర్యాతండా వరకు బీటీ రోడ్డుకు రూ.154 లక్షలు, చందిగణపాయపల్లి రోడ్డు నుంచి జగ్యాతండా వరకు బీటీ రోడ్డుకు రూ.49 లక్షలు బీఆర్ఎస్ ప్రభుత్వం నిధులు మంజూరు చేసిందని గుర్తుచేశారు. ఈ పనులకు టెండర్ ప్రక్రియ పూర్తి చేశామని, త్వరలోనే పనులు ప్రారంభం అవుతాయన్నారు. ఈ రోడ్ల నిర్మాణంతో గిరిజన తండాలకు మెరుగైన రవాణా సౌకర్యం కలుగుతుందన్నారు.

మల్లికార్జున్‌గౌడ్‌ను పరామర్శించిన మాజీ ఎమ్మెల్యే

మెదక్ మున్సిపాలిటీ, జనవరి 12: మున్సిపల్ వైస్ చైర్మన్ ఆరేళ్ల మల్లికార్జున్‌గౌడ్ చిన్నమ్మ ఇటీవలే అనారోగ్యంతో మృతి చెందింది. దీంతో శనివారం ఆ కుటుంబాన్ని మాజీ ఎమ్మెల్యే పద్మాదేవేందర్‌రెడ్డి పరామర్శించారు. ఆమె వెంట బీఆర్ఎస్ పట్టణ కన్వీనర్ మామిళ్ల ఆంజనేయులు, కో కన్వీనర్లు గడ్డమీది కృష్ణాగౌడ్, లింగారెడ్డి, మున్సిపల్ కౌన్సిలర్లు శ్రీనివాస్, కిశోర్, మాజీ కౌన్సిలర్ సలాం, శ్రీనివాస్‌రెడ్డి, శ్యాంసుందర్ ఉన్నారు.

బాధిత కుటుంబాలకు రూ.50 వేల ఆర్థిక సాయం

అల్లీపూర్‌లో ఆర్థిక సాయం అందజేస్తున్న మాజీ జడ్పీటీసీ పబ్బమహేశ్‌గుప్తా

శివ్వంపేట, జనవరి 11: మండలంలోని ఆయా గ్రామాల్లో మృతి చెందిన బాధిత కుటుంబాలకు మాజీ జడ్పీటీసీ పబ్బమహేశ్ గుప్తా రూ.50 వేల ఆర్థిక సాయాన్ని శనివారం అందజేశారు. అల్లీపూర్‌లో మృతి చెందిన పిట్ల నాగరాజు కుటుంబానికి రూ.10 వేలు, కమ్మరి దుర్గాప్రసాద్ కుటుంబానికి రూ.10 వేలు, లింగోజిగూడ తండాలో మాలోత్ చందర్‌నాయక్ కుటుంబానికి రూ.10వేలు, అదే తండాలో మాలోత్ అమ్రానాయక్ కుటుంబానికి రూ.10 వేలు, చిన్నగొట్టిముక్ల గ్రామంలో అనారోగ్యంతో బాధపడుతున్న ఆగమయ్య కుటుంబానికి రూ.5 వేలు, రోడ్డు ప్రమాదంలో గాయపడిన నర్సింలుకు రూ.5 వేల ఆర్థిక సాయంతో పాటు నెలకు సరిపడా నిత్యావసర సరుకులు అందజేశారు. ఆయన వెంట మాజీ సర్పంచ్‌లు పిట్ల సుగుణశ్రీనివాస్, బాలమణి నరేందర్, రవినాయక్, బీఆర్ఎస్ నాయకులు చింతస్వామి, సంద్ర సుదర్శన్, బుర్ర ఆంజనేయులుగౌడ్, పాపయ్యచారీ, నర్సింగరావు, సయ్యద్ సలీం తదితరులు ఉన్నారు.

రోడ్డు కోసం గ్రామస్తుల రిలే నిరాహార దీక్షలు

బీటీ రోడ్డు నిర్మించాలంటూ నినాదాలు చేస్తున్న నస్కల్ గ్రామస్తులు

నిజాంపేట, జనవరి 11: బీటీ రోడ్డు నిర్మించాలని నస్కల్ గ్రామస్తులు నిజాంపేట ప్రధాన రోడ్డుపై రిలే నిరాహార దీక్షలను శనివారం చేపట్టారు. కొన్నేండ్లుగా నస్కల్, రాంపూర్, నగరం, నందగోకుల్ గ్రామాలను కలుపుతూ ఉన్న ప్రధాన రోడ్డు అధ్వానంగా మారిందని గ్రామస్తులు తెలిపారు. వెంటనే బీటీ రోడ్డు పనులను కాంగ్రెస్ ప్రభుత్వం ప్రారంభించాలని డిమాండ్ చేశారు. రోడ్డు పనులు ప్రారంభమయ్యే వరకు రిలే నిరాహార దీక్షలు కొనసాగుతాయన్నారు. కార్యక్రమంలో గ్రామస్తులు దుబాషి సంజీవ్, దేశెట్టి లింగం, నరేశ్‌గౌడ్, లింగం, హబీబ్, దుర్గయ్య, అజయ్, రహీమ్, రాజు, రవి ఉన్నారు.

తిరుపతి వేంకటేశ్వరుని దర్శించుకున్న ఎమ్మెల్సీ శేరి

మెదక్ మున్సిపాలిటీ, జనవరి 11: వైకుంఠ ద్వాదశి పురస్కరించుకుని ఎమ్మెల్సీ శేరి సుభాష్‌రెడ్డి తిరుమల వేంకటేశ్వరుడిని సతీసమేతంగా శనివారం దర్శించుకున్నారు.

చిరుత సంచారం.. అప్రమత్తంగా ఉండాలి

రేగోడ్, జనవరి 11: చిరుత సంచరిస్తున్నదని, ప్రజలు అప్రమత్తంగా ఉండాలని ఫారెస్ట్ రేంజ్ అధికారి వికాస్ శనివారం ప్రకటనలో తెలిపారు. మండలంలోని తిమ్మాపూర్ శివారులో చిరుత సంచరిస్తున్నదన్నారు. చుట్టుపక్కల ప్రజలు, రైతులు జాగ్రత్తగా ఉండాలని సూచించారు.

సంక్రాంతికి ఇంటికి వెళ్తున్నారా.. జాగ్రత్త: సీఐ

రామాయంపేట, జనవరి 11: సంక్రాతికి సొంత గ్రామానికి వెళ్తున్నారా.. మీ ఇంట్లో విలువైన వస్తువులను తీసుకువెళ్లండని సీఐ వెంకటరాజగౌడ్, ఎస్సై బాలరాజు తెలిపారు. శనివారం తన కార్యాలయంలో విలేకరులతో మాట్లాడుతూ పండుగ కోసం ఇంటికి వెళ్తున్న వారు బంగారు ఆభరణాలు, నగదును తీసుకెళ్లాలని సూచించారు.

అదనపు కట్నం కోసం వేధింపులు.. కేసు నమోదు

శివ్వంపేట, జనవరి 11: అదనపుకట్నం తీసుకురావాలని భార్యను భర్త వేధిస్తున్న ఘటన శివ్వంపేట పోలీస్‌స్టేషన్ పరిధిలో చోటుచేసుకున్నది. ఎస్సై మధుకర్‌రెడ్డి తెలిపిన వివరాల ప్రకారం.. తిమ్మాపూర్ గ్రామానికి చెందిన జంగం వెంకటేశ్‌తో తూప్రాన్ మండలం కొనాయపల్లి గ్రామానికి చెందిన స్వప్నకు 14 ఏండ్ల క్రితం వివాహం జరిగింది. మూడు నెలలు బాగానే ఉన్నా వెంకటేశ్ అనంతరం ఎలాంటి పనులు చేయకుండా మద్యానికి బానిసై, రోజూ అదనపు కట్నం కోసం భార్యను వేధించేవాడు. గతంలో పోలీసులు కౌన్సెలింగ్ ఇచ్చారు. అయినా ఎలాంటి మార్పు లేదు. అదనపు కట్నం కోసం వేధిస్తున్న వెంకటేశ్, అత్తపై స్వప్న ఫిర్యాదు చేసింది. దీంతో కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నామని ఎస్సై తెలిపారు.

పోషకాహారంతోనే ఆరోగ్యం

చేగుంట, జనవరి 11: గర్భిణులు, బాలింతలు, చిన్నపిల్లల ఆరోగ్యంపై అప్రమత్తంగా ఉండాలని ఐసీడీఎస్ సూపర్‌వైజర్ సువర్ణ సూచించారు. శనివారం మండలంలోని కర్నాల్‌పల్లి అంగన్‌వాడీ కేంద్రంలో చిన్నపిల్లల ఎత్తు, బరువును కొలుతలు చేశారు.

నమస్తే తెలంగాణ క్లాసిఫైడ్స్

CHANGE OF NAME

I, JUVERIA FATHIMA (New Name), JUVERIA FATIMA (Old Name), D/o. MOHAMMED RAFIUDDIN, R/o. H.No. 12-4-89/6/A, Naseer Nagar, Siddipet (M), Siddipet Dist., T.S. I have changed my name from JUVERIA FATIMA to **JUVERIA FATHIMA.**
[TT-148895]

గమనిక: క్లాసిఫైడ్ ప్రకటనలకు ప్రతిస్పందించే ముందు తగిన రీతిలో క్షుణ్ణంగా విచారించుకోవలసిందిగా పాఠకులకు సూచించడమైనది. ప్రకటనదారు చెబుతున్న లేదా చేసుకుంటున్న క్లెయిములతో నమస్తే తెలంగాణ పత్రికకు ఏ విధమైన సంబంధం లేదు. బ్యాంక్ అకౌంట్ల ద్వారా డబ్బులు ట్రాన్స్‌ఫర్/డిపాజిట్ చేయవద్దు. పాఠకులు ఈ విషయాన్ని గమనించగలరు.

సంక్షేమ పథకాలు పక్కాగా అమలుచేయాలి

సమావేశంలో మాట్లాడుతున్న కలెక్టర్ రాహుల్ రాజ్

ఓబన్న చిత్రపటానికి నివాళులర్పిస్తున్న కలెక్టర్

- సమీక్షా సమావేశంలో కలెక్టర్ రాహుల్ రాజ్

మెదక్ మున్సిపాలిటీ, జనవరి 11: ఇందిరమ్మ ఇండ్ల పథకం, ఇందిరమ్మ ఆత్మీయ భరోసా, రేషన్ కార్డుల జారీ, రైతు భరోసా పథకాలను జిల్లాలో పక్కాగా అమలు చేయాలని కలెక్టర్ అధికారులను ఆదేశించారు. శనివారం కలెక్టరేట్‌లో ఇందిరమ్మ ఇండ్లు, ఇందిరమ్మ ఆత్మీయ భరోసా, రేషన్ కార్డుల జారీ, రైతు భరోసాను అమలు చేసే విధివిధానాలపై సమీక్షించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ ఇందిరమ్మ ఇండ్ల పథకం సర్వే జిల్లాలో 96 శాతం పూర్తి చేశామన్నారు. అర్హత గల లబ్ధిదారులకు ఇందిరమ్మ ఇండ్ల పథకాన్ని పకడ్బందీగా అమలు చేసే దిశగా చర్యలు చేపట్టాలన్నారు. రైతుల సంక్షేమం, నిరుపేద కుటుంబాల అభివృద్ధి కోసం, రైతు భరోసా, ఇందిరమ్మ ఆత్మీయ భరోసా, ఇందిరమ్మ ఇండ్ల వెరిఫికేషన్ ప్రక్రియను పారదర్శకంగా నిర్వహించాలన్నారు. రైతు భరోసాలో అర్హులైన రైతుల వివరాలను క్షేత్రస్థాయిలో సమీక్షించి లబ్దిదారుల పేర్లను జాబితాలో చేర్చాలన్నారు. వెరిఫికేషన్ ప్రక్రియ 16 నుంచి ప్రారంభించి 20 తేదీ వరకు ఫీల్డ్ పనులు పూర్తి చేసి 19వ తేదీ నాటికి కార్యాలయంలో సమీక్ష జరిపి, తుది జాబితాను 20వ తేదీన సమర్పించాలన్నారు. 21 నుంచి 24వ తేదీ వరకు గ్రామసభలు నిర్వహించి తుది జాబితా ఆధారంగా లబ్ధిదారులను ఖరారు చేయాలన్నారు. ప్రతి మండలాన్ని రెండు భాగాలుగా విభజించి ప్రతి భాగానికి డిప్యూటీ తహసీల్దార్‌ను బాధ్యతలు అప్పజెప్పాలన్నారు. డిప్యూటీ తహసీల్దార్‌తో పాటు సీనియర్ అసిస్టెంట్ లేదా జూనియర్ అసిస్టెంట్, కంప్యూటర్ ఆపరేటర్ సహాయంతో డేటాను సక్రమంగా సమీక్షించి, సరైన పద్ధతిలో సర్వేను పూర్తి చేయాలని కలెక్టర్ ఆదేశించారు. సమీక్షలో ఆర్డీవోలు రమాదేవి, జయచంద్రారెడ్డి, మహిపాల్‌రెడ్డి, జడ్పీ సీఈవో ఎల్లయ్య, డీఆర్డీవో శ్రీనివాస్, డీపీవో యాదయ్య, జీఎస్‌వో సురేశ్, వ్యవసాయాధికారి వినయ్, హౌసింగ్ పీడీ మాణిక్యం, హౌసింగ్ డీఈలు, ఈఈలు, ఎంపీడీవోలు, వ్యవసాయ శాఖ ఏడీలు, ఏవోలు పాల్గొన్నారు.

ఘనంగా వడ్డె ఓబన్న జయంతి

బ్రిటీష్ వారిపై వడ్డె ఓబన్న పోరాటం వీరోచితమని కలెక్టర్ రాహుల్ రాజ్ అన్నారు. వడ్డే ఓబన్న జయంతిని శనివారం కలెక్టరేట్‌లో వెనుకబడిన తరగతుల సంక్షేమ శాఖ ఆధ్వర్యంలో నిర్వహించారు. ఓబన్న చిత్రపటానికి నివాళులర్పించారు. మున్సిపల్ చైర్మన్ చంద్రపాల్, బీసీ సంక్షేమాధికారి శ్రీనివాస్, వడ్డెర సంఘం నాయకుడు దుర్గసాయిలు తదితరులు పాల్గొన్నారు.

డివైడర్‌ను ఢీకొని వ్యక్తి మృతి

తూప్రాన్, జనవరి 11: మంచు పొగ కారణంగా రోడ్డు సరిగా కనిపించకపోవడంతో డివైడర్‌ను ఢీకొని వ్యక్తి మృతి చెందిన ఘటన తూప్రాన్ పోలీస్ స్టేషన్ పరిధిలో జరిగింది. ఎస్ఐ శివానందం తెలిపిన వివరాల ప్రకారం బెజ్మా తండాకు చెందిన రత్లా శ్రీను వ్యక్తిగత పనిపై ఎల్లంపేట్ వెళ్లి మనోహరాబాద్ నుంచి తూప్రాన్ వైపునకు బైక్‌పై వస్తున్నాడు. ఈ క్రమంలో శనివారం ఉదయం శ్రీను ఇమాంపూర్ శివారులోకి రాగానే పొగమంచు కారణంగా రోడ్డు సరిగా కనిపించకపోవడంతో అక్కడున్న డివైడర్‌ను ఢీకొట్టాడు. దీంతో ఆయన తీవ్ర గాయాలపాలయ్యాడు. క్షతగాత్రుడిని వెంటనే తూప్రాన్ ప్రభుత్వ దవాఖానకు, అక్కడ నుంచి మెరుగైన చికిత్స కోసం నగరంలోని గాంధీ దవాఖానకు తరలిస్తుండగా మార్గమధ్యలో మృతి చెందాడు. మృతుడి బావమరిది బానోత్ రాజు ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి, దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ తెలిపారు.

ఆటో బోల్తా.. కూలీలకు గాయాలు

పాపన్నపేట, జనవరి 11: నాట్లకు వెళ్లిన కూలీలను తీసుకొస్తున్న ఆటో బోల్తాపడి ఆరుగురికి గాయాలైన ఘటన పాపన్నపేట పోలీస్‌స్టేషన్ పరిధిలోని నార్సింగ్ గ్రామ శివారులో దారిదేవుని ఆలయం వద్ద శనివారం రాత్రి జరిగింది. ఎస్సై శ్రీనివాస్‌గౌడ్ తెలిపిన వివరాల ప్రకారం.. పాపన్నపేటలోని చిన్న హరిజన వాడకు చెందిన 15 మంది మహిళా కూలీలు వరి నాట్లు వేసేందుకు వట్‌పల్లి మండలం బుడ్డాయిపల్లి గ్రామానికి వెళ్లారు. నాట్లు ముగించుకుని సాయంత్రం స్వగామానికి ఆటోలో తిరిగి వస్తుండగా పాపన్నపేట శివారులో ఆటో బోల్తాపడింది. ఘటనలో పాపన్నపేటకు చెందిన బాలమణి, మరియమ్మ, నిర్మల, కుంటిగారి మరియమ్మ, కుమ్మరి సావిత్రితో పాటు డ్రైవర్ హరీశ్‌కు గాయాలయ్యాయి. విషయం తెలుసుకున్న పోలీసులు 108 వాహనంలో మెదక్ ఏరియా దవాఖానకు క్షతగాత్రులను తరలించారు. ఈ విషయంలో పాపన్నపేట ఎస్సై శ్రీనివాస్ గౌడ్‌ను వివరణ కొరగా ఘటనపై ఫిర్యాదు అందలేదని తెలిపారు. ఆటోలో సుమారు 15 మంది కూలీలు ఉన్నట్లు సమాచారం అందిందని తెలిపారు.

అలరించిన ముగ్గుల పోటీలు

పెద్దశంకరంపేటలో ముగ్గుల పోటీలు

నర్సాపూర్‌లో..

పెద్దశంకరంపేట,జనవరి11: పెద్దశంకరంపేటలోని సరస్వతీ శిశుమందిరంలో శనివారం నిర్వహించిన ముగ్గుల పోటీలు అందరినీ ఎంతగానో ఆకట్టుకున్నాయి. విద్యార్థులు రంగవల్లులను అందంగా అలంకరించారు. గెలుపొందిన విద్యార్థినులకు మాజీ ఎంపీపీ జంగం శ్రీనివాస్, పాఠశాల కమి టీ అధ్యక్షులు దాదిగారి గంగాధర్ బహుమతులు అందజేశారు. ప్రధానాచార్యులు వీరప్ప ఉన్నారు.

నర్సాపూర్‌లో..

నర్సాపూర్,జనవరి11: నర్సాపూర్‌లోని అక్షర స్కూల్‌లో నిర్వహించిన సంక్రాంతి వేడుకల్లో పాల్గొన్న మున్సిపల్ చైర్మన్ అశోక్ గౌడ్, స్కూల్ డైరెక్టర్ నల్లగండ్ల అశోక్‌కుమార్, బీఆర్ఎస్ నాయకుడు చౌటి జగదీశ్, ప్రిన్సిపాల్ రాశి

చేగుంటలో ముగిసిన ముగ్గుల పోటీలు

చేగుంట, జనవరి 11: చేగుంట జడ్పీహెచ్ఎస్‌లో ముగ్గుల పోటీలు ముగిశాయి. ఈ పోటీలో ప్రతిభ కనబరిచిన వారికి ఎంఈవో నీరజ బహుమతులు అందజేశారు.

సంక్రాంతి కలర్స్ అందజేసిన కౌన్సిలర్

రామాయంపేట, జనవరి 11: సంక్రాంతి సందర్భంగా 11వ వార్డు కౌన్సిలర్ చిలుక గంగాధర్ వార్డులోని మహిళలకు ముగ్గుల కలర్స్‌ను అందజేశారు.

చేగుంటలో బహుమతులు అందజేత

రామాయంపేటలో కలర్ల పంపిణీ

పతంగుల ఎగురవేతలో జాగ్రత్తలు పాటించాలి

పతంగులు కొంటున్న చిన్నారులు

వివిధ డిజైన్లలో పతంగులు

- కొనుగోలుదారులతో కళకళలాడుతున్న దుకాణాలు
- చైనా మాంజా అమ్మితే కేసులు

మెదక్‌రూరల్ జనవరి 11: సంక్రాతి అంటే చిన్నారులు, యువకులకు పతంగుల పండుగ. స్కూళ్లకు సెలవులిచ్చారు. దీంతో చిన్నారులు ఉత్సాహంగా పతంగుల ఎగురవేస్తున్నారు. దీంతో పతంగుల దుకాణాలు కళకళలాడుతున్నాయి. చిన్నా పెద్దా తేడా లేకుండా పతంగులు కొంటున్నారు. మార్కెట్లో ఈసారి రకరకాల పతంగులు వచ్చాయి. జాతీయ జెండా, చోటాభీమ్, సినిమా హీరో, హీరోయిన్లు, ఫిష్, రాజకీయ ప్రముఖులు, స్పైడర్ మన్, సీతాకోకచిలుక, బెన్–10, డేగ, వాహనల బొమ్మలు, రకరకాల ఆకృతుల్లో పతంగులు అందుబాటులో ఉన్నాయి. నాణ్యత, సైజును బట్టి పతంగుల ధర రూ.2 నుంచి 100 వరకు విక్రయిస్తున్నారు.

పాటించాల్సిన జాగ్రత్తలు

భవనాలపై పతంగులు ఎగురవేసేవారు జాగ్రత్తగా ఉండాలి. పతంగులు ఎగురవేస్తూ వెనక్కి వెళితే కిందపడి ప్రమాదాలు జరిగే అవకాశం ఉంది. పతంగులను ఎగురవేసేటప్పుడు విశాలమైన ప్రదేశాలను ఎంచుకోవాలి. తల్లిదండులు చిన్నారులను అనుక్షణం గమనిస్తూ ఉండాలి. ప్రహరీ లేని భవనాల పైకి ఎక్కి పతంగులు ఎగురవేయవద్దు. విద్యుత్ స్తంభాలకు దూరంగా ఉండాలి. రద్దీ ప్రాంతాల్లో గాలిపటాలు ఎగురవేయకూడదు. దీంతో ట్రాఫిక్ సమస్యలు, ప్రమాదాలు జరిగే అవకాశం ఉంటుంది. విద్యుత్ వైర్లకు అతుక్కుపోతే గాలిపటాలు తీయడానికి ప్రయత్నిచొద్దు.

చైనా మాంజా వాడొద్దు

చైనా మాంజా విక్రయాలను అరికట్టేందుకు అటవీ, పోలీసు శాఖ అధికారులు విస్తృతంగా చర్యలు చేపడుతున్నారు. పతంగుల దుకాణాల్లో పర్యటిస్తూ మాంజా అనర్థాలపై అవగాహన కల్పిస్తున్నారు. చైనా మాంజా అమ్మితే కేసులు నమోదు చేస్తున్నారు.

మెదక్‌లో పతంగుల దుకాణాల్లో అధికారుల తనిఖీలు

ఇద్దరు ఫీల్డ్ అసిస్టెంట్ల సస్పెన్షన్

- రూ.5 లక్షల 66 వేలు రికవరీ
- రూ.76 వేలు ఫైన్ వేశాం: స్టేట్ విజిలెన్స్ అధికారి శ్రీహరి

కౌడిపల్లి, జనవరి 11: ఉపాధి హామీ పథకంలో 2023–24 సంవత్సరంలో మండలంలో జరిగిన పనుల్లో అక్రమాలకు పాల్పడిన వెల్మకన్న ఫీల్డ్ అసిస్టెంట్ ముత్తు, ధర్మాసాగర్ ఫీల్డ్ అసిస్టెంట్ మల్లేశాన్ని విధుల నుంచి సస్పెండ్ చేసినట్లు స్టేట్ విజిలెన్స్ అధికారి శ్రీహరి శనివారం తెలిపారు. 29 గ్రామ పంచాయతీల్లో జరిగిన ఉపాధి హామీ పనులపై ఈనెల 10న ఎంపీడీవో కార్యాలయంలో 15వ సామాజిక తనిఖీ ప్రజావేదిక నిర్వహించిన విషయం విదితమే. డీఆర్‌పీలు గ్రామాల్లో క్షేత్రస్థాయిలో పర్యటించి ఫీల్డ్ అసిస్టెంట్లు, ఉపాధి కూలీలు, గ్రామస్తుల సమక్షంలో గ్రామ సభలు నిర్వహించారు. ప్రజావేదికలో అధికారులకు సమర్పించగా అవినీతికి పాల్పడిన వెల్మకన్న, ధర్మాసాగర్ ఫీల్డ్ అసింస్టెంట్లను సస్పెండ్ చేసి మండలంలోని పలువురికి రూ.5లక్షల 66వేలు రికవరీ, 76వేలు జరిమానా విధించినట్లు తెలిపారు.

స్మారక వాలీబాల్ టోర్నీకి ఆహ్వానం

రేగోడ్, జనవరి 11: స్మారక వాలీబాల్ టోర్నీకి రావాలని డీఎస్పీని ఆహ్వానించినట్లు బీఆర్ఎస్ సీనియర్ నాయకుడు బగిలి శ్రీనివాస్ తెలిపారు. మండలంలోని లింగంపల్లిలో మాజీ సర్పంచ్ బగిలి హన్మప్ప స్మారక వాలీబాల్ టోర్నీని ఈ నెల 13, 14వ తేదీల్లో నిర్వహించనున్నట్లు తెలిపారు. ఆసక్తి గల వారు 12న సాయంత్రం వరకు పేర్లు నమోదు చేసుకోవాలని సూచించారు. చంద్రయ్య, శ్రీనివాస్, దేవరాజ్ ఉన్నారు.

మిల్లీ కౌన్సిల్ కమిటీ అధ్యక్షుడిగా ఒమర్ ఖాన్

మెదక్ మున్సిపాలిటీ, జనవరి 11: మిల్లీ కౌన్సిల్ కమిటీ పట్టణ అధ్యక్ష, కార్యదర్శులుగా ఒమర్‌ఖాన్, డాక్టర్ సూఫీ ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. శనివారం మైనారిటీ ఫంక్షన్ హాల్‌లో ఏకగ్రీవంగా కమిటీని ఎన్నుకున్నారు. కోశాధికారిగా మౌలానా అబేద్ అలీ, ఉపాధ్యక్షుడిగా ముజీబ్, సంయుక్త కార్యదర్శిగా మహమ్మద్ రియాజుద్దీన్ ఎన్నికయ్యారు. మాజీ కౌన్సిలర్ మున్నా, నాయకులు షఫీ, ఫాజిల్, ఉమర్, జుబేర్ పాల్గొన్నారు.

కార్మికుల పెండింగ్ వేతనాలు చెల్లించాలి

నర్సాపూర్, జనవరి 11: మిషన్ భగీరథ కాంట్రాక్టులో పని చేస్తున్న కార్మికులకు పెండింగ్‌లో ఉన్న ఐదు నెలల వేతనాలను తక్షణమే చెల్లించాలని సీఐటీయూ జిల్లా అధ్యక్షుడు మహేందర్‌రెడ్డి ప్ర భుత్వాన్ని డిమాండ్ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మిషన్ భగీరథ ఏర్పడినప్పటి నుంచి కాంట్రాక్టర్లు మారుతున్నారే తప్ప మిషన్ భగీరథ కార్మికుల బతుకులు మారడం లేదని మండిపడ్డారు. కార్మికుల వే తనాలు ఇవ్వాలని కాంట్రాక్టర్‌ను అడిగితే బి ల్లులు రావట్లేదని, అడిగిన వారిని ఉద్యోగాల నుంచి తొలగిస్తున్నారన్నారు. ఇదే పద్ధతి కొనసాగితే సమ్మె చేస్తామని హెచ్చరించారు.

పండుగపూట కార్మికులు పస్తులుండాలా?

తూప్రాన్, జనవరి 11: పండగ పూట పంచాయతీ కార్మికులు పస్తులుండాలా అని సీఐటీయూ జిల్లా అధ్యక్షుడు ఎ.మహేందర్‌రెడ్డి ప్రభుత్వాన్ని ప్రశ్నించారు. తూప్రాన్‌లో నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ పంచాయతీ కార్మికుల పెండింగ్ వేతనాలు వెంటనే చెల్లించి, మల్టీపర్పస్ విధానాన్ని రద్దు చేయాలన్నారు. కాంగ్రె స్ మేనిఫెస్టోలో కార్మికుల వేతనాలు పెంచి, పర్మినెంట్ చేస్తామని ప్రకటించినా, ఒక్క హామీ అమలుకు నోచుకోలేదని దుయ్యబట్టారు. ఆ యనతో యునైటెడ్ ఎలక్ట్రిసిటీ ఎంప్లాయీస్ యూనియన్ అధ్యక్షుడు ఎం.నర్సింలు, ఉపాధ్యక్షుడు జీవన్ ఉన్నారు.

రికవరీ చేసిన సెల్‌ఫోన్ల అప్పగింత



తూప్రాన్, జనవరి 11: మండలంలోని పలు ప్రాంతాలకు చెందిన వ్యక్తులు పోగొట్టుకున్న సెల్‌ఫోన్లను తూప్రాన్ పోలీసులు ట్రేస్ చేసి తూప్రాన్ డీఎస్పీ వెంకట్ రెడ్డి, చేతుల మీదుగా శనివారం పది మంది బాధితులకు అందజేశారు. సెల్‌ఫోన్ పోయిన వెంటనే సీఈఐఆర్ పోర్టల్‌లో వివరాలు నమోదు చేయించుకోవాలని, తద్వారా పోగొట్టుకున్న సెల్‌ఫోన్లను ట్రేస్ చేసి పట్టుకోవడం సులభతరమౌతుందని డీఎస్పీ వెంకట్ రెడ్డి తెలిపారు. సీఐ రంగ కృష్ణ, ఎస్ఐ శివానందం పాల్గొన్నారు.